నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 108 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
24-02-2026 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4

# ఎర్రన్న ఆశయాలే అభివృద్ధి దిశ

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- శ్రీకాకుళం జిల్లాలో ఘనంగా ఎర్రంనాయుడు 69వ జయంతి
- సాగునీరు, ఉపాధి లక్ష్యంగా కృషి కొనసాగుతోంది
- నేరేడు బ్యారేజి, పరిశ్రమల ఏర్పాటుపై త్వరలో ఫలితాలు








**నవతరం శ్రీకాకుళం**

దివంగత నాయకుడు ఎర్రంనాయుడు ఆశయాల సాధనకే తమ కృషి కొనసాగుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎర్రంనాయుడు 69వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ఎర్రంనాయుడు నాయకత్వం ఆదర్శప్రాయమని, సాధారణ రైతు కుటుంబం నుంచి దేశ స్థాయి నాయకుడిగా ఎదిగి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. ఆయన రాజకీయ జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. జిల్లా రైతులకు సాగునీరు అందించేందుకు ఎర్రంనాయుడు చేసిన కృషిని కొనసాగిస్తున్నామని, నేరేడు బ్యారేజి నిర్మాణంపై కేంద్ర జలవనరుల శాఖతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఒడిశా ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, కూటమి ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధికి పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించడమే లక్ష్యమని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన రేర్ ఎర్త్ కారిడార్ ద్వారా శ్రీకాకుళం జిల్లాకు ప్రయోజనం చేకూరుతుందని, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రాజెక్టులను ముందుకు తీసుకెళు_న్నామని వెల్లడించారు. పోర్టు పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లాలో ఎర్రన్న జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో కూటమి నాయకులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెలియాపుట్టి ఐటీడీఏ కోసం 26న కలెక్టరేట్ వద్ద ధర్నా

- ఐటీడీఏ ఏర్పాటు పై అసెంబ్లీలో తీర్మానం చేయాలన్న డిమాండ్
- సారవకోటలో కరపత్రం ఆవిష్కరణ



**నవతరం -సారవకోట**

శ్రీకాకుళం జిల్లాకు మెలియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 26న శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద జ్యోతిరావు పూలే ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ్ యోగి తెలిపారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని సారవకోటలో ఆవిష్కరించారు.

జిల్లాల విభజన అనంతరం ఐదు సంవత్సరాలు గడిచినా శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు కాలేదని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధి దృష్ట్యా మెలియాపుట్టి -మిగతా 2లో

# స్వగ్రామంలో బ్యాంక్ ఖాతా తెరిచిన కేంద్ర మంత్రి

2లో



- నిమ్మాడ లో ఎస్.బి.ఐ నూతన శాఖను ప్రారంభించిన కేంద్ర మంత్రి
- రైతులు, పారిశ్రామికవేత్తలకు మరిన్ని సేవలు అందించాలి

# సహాయకుల అవిశ్రాంత కృషిని అందరం గుర్తించాలి

- వైద్యసేవలో సహాయక సిబ్బంది లేకపోతే, ఏదీ సాధ్యం కాదు
- లయన్ డా.పైడి.సింధూర



**నవతరం -శ్రీకాకుళం**

వైద్యసేవలో సహాయక సిబ్బంది లేకపోతే, ఏదీ సాధ్యం కాదని, అసాధ్యాన్ని, సుసాధ్యం చేస్తున్న వైద్య సహాయకులకు రుణపడి ఉన్నామని, ప్రముఖ వైద్యురాలు లయన్ డా.పైడి.సింధూర అన్నారు. స్థానిక సింధూర వైద్యశాలలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు లయన్ డా.పైడి.సింధూర ఆధ్వర్యంలో జాతీయ ఆతిథ్య కార్మికుల దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె -మిగతా 2లో

# రెవెన్యూ ఎండోమెంట్ స్థలం పబ్లిక్ గా కబ్జా పంచాయతీ కాలువ జెసిబితో కప్పివేత- మహిళలు నిరసన



**నవతరం -మందస**

మండల కేంద్రమైన మందస లో గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న గ్రామ పంచాయతీకి చెందిన మురుగు నీరు మరియు వర్షం నీరు ప్రవహించే కాలువ సోమవారం ఆక్రమణకు గురైంది ఆక్రమణదారులు బాహాటంగా కాలువను ఆక్రమించి కాలువను జెసిబి తో పూడ్చేశారు కాలువ స్థలం ఆక్రమణ జరగడంతో హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు ఈ కాలనీలో ఉండే కాలువల నుంచి మురుగునీరు కబ్జాకు గురైన కాలువ ద్వారా ప్రవహిస్తుంది అంతేకాకుండా వర్షాకాలంలో కూడా కాలనీవాసుల కాలువల ద్వారా ఈ కబ్జాకు గురైన కాలువ ద్వారా నీరు ప్రవహిస్తుంది. ఇంతటి ప్రాధాన్యత గల కాలువను ఆక్రమణదారులు ఆక్రమించడం పట్ల కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు కబ్జాకు గురైన ఈ కాలువతో పాటు కాలువ పక్కనే ఉన్న రెవెన్యూ ఎండోమెంట్ శాఖలకు చెందిన స్థలం కూడా ఆక్రమణదారులు ఆక్రమించి జెసిబి తో చెత్తాచెదారాన్ని తొలగించారు ఈ కాలువ ను పూడ్చివేసి ఆక్రమించడం వల్ల కాలనీలో ఉన్న కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండి పోతుందని కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు తక్షణమే ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ బోర్డ్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మద్దిల తిరుపతిరావు ముకుందరావు ప్రభుత్వ ఎండోమెంట్ స్థలాన్ని పబ్లిక్ గా కబ్జా చేస్తున్న ఆక్రమణదారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, పంచాయతీ రెవెన్యూ అధికారులకు కోరారు.



# ఎమ్మెల్యే గారు.. ప్రభుత్వ భూములు పరిరక్షించండి



- జగన్నాథ సాగరం, నర్సిపురం చెరువు గర్భాలలో భూ ఆక్రమణలు తొలగించండి
- పలాస వ్యవసాయం మార్కెట్ యార్డ్ వెనుక మరియు సూది కొండలో భూకబ్జాలను నియంత్రించండి
- దేవుడి భూములను కాపాడండి
- చెరువులు.. ప్రభుత్వ భూములకు ఇనుప కంచెతో పాటు బోర్డులు ఏర్పాటు చేయండి
- పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ (బాబా) డిమాండ్

**నవతరం -పలాస**

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు కేరాఫ్ అడ్రస్ గా పలాస కేంద్రంగా మారడంఆందోళన కలిగిస్తుందని, రోజురోజుకు ప్రభుత్వ భూఆక్రమణలు కొందరు రాజకీయ నాయకులు, అక్రమార్కులు వివిధ ప్రభుత్వ అధికారుల అండదండలతో చెరువు గర్భాలు, కొండ ప్రాంతాలు, ఇతర బంజరు భూములను సైతం కూడా యదేచ్ఛగా కబ్జాలు, అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారని ప్రముఖ సామాజికవేత్త, పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్( బాబా) ఆరోపించారు. సోమవారం పలాసలో తన నివాసం వద్ద మాట్లాడుతూ, పేదోళ్లు గూడు కోసం, అసైన్డ్ భూముల్లో గుడిసెలు వేస్తే అధికారులు -మిగతా 2లో

ఎడిటోరియల్

# యుద్ధమేఘాలు!

కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న మధ్యప్రాచ్యం మళ్లీ కల్లోలంగా మారుతోంది. ఇరాన్‌పై పెరుగుతున్న సైనిక, ఆర్థిక ఒత్తిడి, గాజా మారణకాండ పరిణామాలు, హర్మూజ్ జలసంధి చుట్టూ ఉద్రిక్తతలు, ఇవన్నీ కలిసి ప్రపంచాన్ని అస్థిరత దిశగా నడిపిస్తున్నాయి. ఇది కేవలం దేశాల మధ్య ఘర్షణ కాదు, సామ్రాజ్యవాద శక్తులు, తమ అధిపత్యాన్ని కాపాడుకునేందుకు, ఎవరూ ఎదురుతిరగకుండా తమ బలాన్ని ప్రదర్శించేందుకు ఆడుతున్న ప్రమాదకర రాజకీయ క్రీడ. మొన్నటివరకు వెనిజులాపై తీవ్ర ఆర్థిక ఆంక్షలు కొనసాగించిన అమెరికా, తలొగ్గక పోవడంతో మాదక ద్రవ్యాల రవాణా పేరుతో అధ్యక్షుడు నికోలస్ మదురో దంపతులను కిడ్నాప్ చేసింది. విచారణ పేరుతో ఇప్పటికీ తమవద్దే బంధీలుగా ఉంచుకుంది. ఇది ఆధిపత్యం, అహంకార ధోరణే తప్ప వేరేకాదు. చమురు సంపద కలిగిన దేశం తన స్వతంత్ర ఆర్థిక విధానాన్ని కొనసాగిస్తే అది అమెరికా ప్రయోజనాలకు విరుద్ధం. దాన్ని అడ్డుకోవడానికే వెనిజులా మీద కేంద్రీకరించింది. ఇప్పుడు లొంగదీసుకునేందుకు ఇరాన్‌పై ఒత్తిడి తెస్తోంది. ప్రపంచంలో చమురు నిల్వలు ఎక్కువగా ఉన్న మధ్యప్రాచ్యంలో పాగా వేయాలన్నది అమెరికా లక్ష్యం. గత రెండు దశాబ్దాలుగా ప్రజాస్వామ్యం, భద్రత పేరుతో జోక్యం చేసుకుంటోంది. ఇరాక్, లిబియా, సిరియా వంటి దేశాలపై దాడులు కూడా చేసింది. కానీ, ఆ దాడుల అనుభవం నేర్పిన పాఠం-శాంతికాదు, విధ్వంసమే. చమురు వనరులపై నియంత్రణ, భౌగోళిక ఆధిపత్యం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తమకు సవాల్ విసురుతున్న చైనా, రష్యాల ప్రభావాన్ని అడ్డుకోవడం ప్రధాన ఉద్దేశం! అయితే, రష్యా, చైనాలు మధ్యప్రాచ్య దేశాలపై పట్టువిధిస్తే, అక్కడి దేశాలు తమ మాట వినవనే అమెరికా భయం. అందుకే మొన్న వెనిజులా మీద దాడికి దిగింది. ఇప్పుడు ఇరాన్ మీద యుద్ధానికి కాలు దువ్వుతున్నది! ముందు ఆర్థిక ఆంక్షలు, తర్వాత సైనిక విన్యాసాలు చేపట్టింది. ఓవైపు చర్చలకు సిద్ధమంటూనే, మరోవైపు ఆ చర్చలను విచ్ఛిన్నం చేసే పద్ధతులకు పాల్పడుతోంది. ఇరాన్‌పై ఒత్తిడికి అణు కార్యక్రమం ఒక్కటే కారణం కాదు, ఇరాక్, సిరియా, లెబనాన్ వంటి దేశాల్లో దాని ప్రభావం పెరగడం కూడా నచ్చని అంశం. ఇరాన్‌పై 'అణు ఆయుధ వ్యాప్తిని అడ్డుకోవాలి' అమెరికా చేస్తున్న వాదన. కానీ, రష్యాతో అణు ఆయుధ నియంత్రణ ఒప్పందం గడువు 2026 ఫిబ్రవరితో ముగిసింది, నేటికీ పునరుద్ధరణ చేసుకోలేదు. ఇలాంటిది అణు సమతుల్యతను మరింత అనిశ్చితిలో పడేసే విధానం. అంటే ఒకవైపు అణువ్యాప్తి నిరోధం పేరుతో ఒత్తిడి, మరోవైపు పెద్ద అణుశక్తుల మధ్య నియంత్రణ వ్యవస్థ బలహీనపడటం. ఇది ఇరాన్‌పై ఒత్తిడి, మధ్యప్రాచ్య శక్తి సమీకరణలను ప్రభావితం చేయడానికి ఉపయోగపడుతుంది. గల్ఫ్ ప్రాంతంలో సైనిక బలగాల మోహరింపు, యుద్ధనౌకలు, ఫైటర్‌జెట్లు, సంయుక్త సైనిక విన్యాసాలు అందులో భాగమే. వీటికి 'స్వేచ్ఛాయుత నావిగేషన్' పేరు చెబుతున్నప్పటికీ ఇరాన్‌కు అర్థమైంది-ఇదంతా తమమీద చేపట్టిన వ్యూహాత్మక ఒత్తిడిలో భాగమేనని. ఇలాంటప్పుడు చైనా, రష్యాలు జోక్యం చేసుకోవచ్చుకదానన్న అభిప్రాయాలు వస్తాయి. కానీ, ప్రత్యక్ష జోక్యం ప్రపంచ యుద్ధానికి దారితీస్తుంది. ఆ రెండు దేశాలు అమలుచేసే విధానం అమెరికా ఆంక్షల రాజకీయాన్ని బలహీనపర్చడం. దౌత్యమార్గంలో ప్రభావం చూపడం. హార్మూజ్ జలసంధిని మూసివేస్తామన్న ఇరాన్ హెచ్చరిక కూడా ప్రతిస్పందనలో భాగమే. ప్రపంచంలోని అన్ని దేశాలకు చమురును గణనీయంగా రవాణా చేసే మార్గమిది. ఇరాన్- ఒమాన్ మధ్యలో ఉన్న ఈ జలసంధి మధ్యప్రాచ్య దేశాలకు ఆయువు పట్టు లాంటిది. ఇక్కడ ఉద్రిక్తత పెరిగితే చమురు ధరలు ఎగిసిపడతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థిక ఒడిదుడుకుల్లో పడతాయి. అప్పుడు ప్రపంచ ఆర్థికంపై ప్రభావం చూపడమే కాదు, తమ చమురు రవాణాకు అడ్డుతగిలితే ఇతర దేశాల రవాణాను కూడా ప్రభావితం చేయగలమని చెప్పడం. దీనికి దోషి అమెరికానేనన్న సంకేతం. ఏమైనా మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచశాంతికి పరీక్షగా మారాయి. శక్తి ప్రదర్శనలు, ఆంక్షల రాజకీయాలు సమస్యలు పరిష్కరించవు. అవి మరింత క్లిష్టతరం చేస్తాయి. అమెరికా ఏక చత్రాధిపత్యాన్ని అడ్డుకునే అంతర్జాతీయ సమాజం ఏకమవ్వాలి. యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న ఈ సమయంలో, శాంతి, పరస్పర గౌరవం, సార్వభౌమాధికార పరిరక్షణ- ఇవే ముందుకు నడిపే మార్గాలు. లేకపోతే మధ్యప్రాచ్యం మాత్రమే కాదు, ప్రపంచమే మరో పెద్దసంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

# మెలియాపుట్టి ఐటీడీఏ కోసం 26న కలెక్టరేట్ వద్ద ధర్నా

మొదటిపేజీ తరువాయి

కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల సమయంలో మెలియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని చేసిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై తీర్మానం చేయాలని కోరారు. కార్యక్రమంలో చింతపల్లి భాస్కరరావు, జన్ని ప్రవీణ్, గేదెల హరి, పెద్దింటి అప్పన్న, దుర్గాప్రసాద్, దుర్గారావు, జన్ని నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# స్వగ్రామంలో బ్యాంక్ ఖాతా తెరిచిన కేంద్ర మంత్రి

**నవతరం -నిమ్మాడ**

స్థానిక రైతులకు, పరిశ్రమలకు మరింత ఉపయుక్తంగా ఎస్.బి.ఐ బ్యాంక్ నిమ్మాడ శాఖ మారనుందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం నాడు నిమ్మాడలో ఎస్.బి.ఐ నూతన శాఖను ఆయన ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ పరిసరాలను కలియతిరిగారు. పలు కౌంటర్లను ప్రారంభించారు. మొదటి లావాదేవిని జరిపిన స్థానికులకు సంబంధిత ఎక్నాలెడ్జ్మెంట్ పత్రాలను అందించారు. తర్వాత తన సొంత ఊరిలో తనకి కూడా ఒక బ్యాంక్ అకౌంట్ ఖచ్చితంగా ఉండాలని తెలుపుతూ.. నూతన అకౌంట్ ఫారం ను స్వయంగా నింపి, సంతకాలు చేసి బ్యాంక్ అధికారులకు అందజేశారు.

తన స్వగ్రామం నిమ్మాడ లో ఎస్.బి.ఐ లాంటి విలువైన సేవలు అందిస్తున్న బ్యాంక్ ను ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. స్థానిక రైతులకు, పరిశ్రమల వారికి ఇది మరింత ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. స్థానికంగా వ్యాపారాలు మరింత వృద్ధి చెందుతాయని తెలిపారు. ఇక్కడి అన్నదాతలకు మరింత లబ్ధి చేకూర్చే పథకాలపై స్థానికంగా విస్తృత ప్రచారం కల్పించాలని బ్యాంక్ అధికారులను కోరారు. వారి ఆర్థిక లావాదేవీల్లో ఎస్.బి.ఐ కీలక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లక్ష్యాలను చేరుకోవడంలో బ్యాంకుల ది కీలక పాత్ర అని అన్నారు.

ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ను ఘనంగా సత్కరించగా.. కేంద్ర మంత్రి సైతం తన స్వగ్రామంలో శాఖ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా ఎస్.బి.ఐ అధికారులకు సత్కరించి జ్ఞాపికను అందజేశారు.
ఈ కార్యక్రమంలో ఎస్.బి.ఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పాటిల్, ఎస్బిఐ అమరావతి సర్కిల్ జనరల్ మేనేజర్ హేమంత్ కుమార్, డిప్యూటీ జెనరల్ మేనేజర్ రాహుల్ సకారియా, రీజినల్ మేనేజర్ ఉదయ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ నాగరాజు, ఎస్బిఐ స్టాఫ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ సతీష్, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ డి.ఎన్.ఆర్ కుమార్, శ్రీకాకుళం రీజియన్ రీజనల్ సెక్రటరీ వెంకటరమణ, నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్, కింజరాపు హరివరప్రసాద్, కింజరాపు ప్రభాకరరావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గారు.. ప్రభుత్వ భూములు పరిరక్షించండి

మొదటిపేజీ తరువాయి

నానా హంగామా చేసి వాటిని తొలగించి కేసులు పెట్టడం మనం చూస్తుంటామని, అలాంటిది కొన్ని కోట్ల రూపాయలకు విలువచేసే ప్రభుత్వ భూములతో పాటు చెరువు గర్భాలు, కొండ ప్రాంత వాగులు సైతం కబ్జాలు చేసి, ఆ భూములు అమ్మకాలు జరిపి, అక్రమ నిర్మాణాలు మొదలుపెట్టడం చూస్తే, పలాస లో అభివృద్ధి కంటే భూకబ్జాలే అధికంగా కనిపిస్తున్నాయని దువ్వాడ శ్రీధర్( బాబా) ఆందోళన వ్యక్తం చేశారు అధికార, విపక్ష పార్టీలలో ఉన్న కొందరు బడా నేతలు సుదీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగుతూ, పలాస పురుషోత్తపురం, సూది కొండ, పద్మనాపురం తదితర రెవిన్యూ గ్రామాలలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించి కోట్లాది రూపాయలకు ఈ అక్రమార్కులు అమ్ముకున్నారన్నారు. అదేవిధంగా సుమారు 60 ఎకరాలకు పైగా ఉన్న జగన్నాథ సాగరం లో అక్రమంగా మట్టి పూడ్చి, తర్వాత చెరువు గర్భాలను సైతం అమ్ముకుంటున్నారని, సూది కొండ కు సంబంధించిన వరద కాలువలను సైతం ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టిన కుహనా పెద్దమనుషులు లేకపోలేదు అన్నారు. పలాస లో భూముల రేట్లు తో పాటు భూ దందాలు కూడా పెరుగుతున్నాయని, ఎవరికి అనుమానం రాకుండా రెవిన్యూ రికార్డులు మార్చేసి విలువైన ప్రభుత్వ భూములు భూ బకాసురులు కొట్టేస్తున్న తీరు పై వివిధ సామాజిక మాధ్యమాల్లో కొందరు యువత వాస్తవాలు వెల్లడిస్తున్నారన్నారు. అదేవిధంగా కోట్లాది రూపాయలు విలువచేసే దేవుడు భూములకు కూడా భద్రత లేకుండా పోయిందని, వాటిని కాపాడుకోవడానికి బాధ్యత గల ప్రభుత్వంఉన్నతాధికారులు, ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులు చొరవ చూపకపోవడం శోచనీయమన్నారు. కేంద్రీయ విద్యాలయం కోసం అంటూ పేదల గుడిసెలు తొలగించి, అక్రమార్కుల చేతిలో ఉన్న ప్రభుత్వ భూములను విడిచిపెట్టి, స్వామి భక్తిని ప్రభుత్వ యంత్రాంగం తో పాటు ప్రజా ప్రతినిధి కూడా మౌనం దాల్చడంలో ఆంతర్యం ఏమిటో పలాస ప్రజలు గమనిస్తున్నారని దువ్వాడ శ్రీధర్ ( బాబా) పేర్కొన్నారు.
అంతర్జాతీయ స్థాయిలో పలాస జీడిపప్పుకు ఒక మంచి బ్రాండ్ ఉండడంతో, ఇక్కడ చిన్న తరహా పరిశ్రమలు విస్తరించడంతో, ఈ ప్రాంతం లో భూములకు విలువ పెరిగిందని, అయితే కేంద్రీయ విద్యాలయానికి సేకరించిన భూమికి అటు ఇటుగా ప్రభుత్వ బంజర భూములను కొందరు అధికారపక్ష నేతల అనుచరుల చెర లో ఉన్నాయని, భూములకు రేట్లు రావడంతో, ఈ ప్రభుత్వ బంజరు భూములు ఆక్రమించి అమ్ముకోవడం పరిపాటిగా మారిందన్నారు. ఈ ప్రాంతంలో ఇంటి స్థలాలను కొనేందుకు మధ్యతరగతి ప్రజానీకం మొగ్గుచూపుడంతో ఇంటి స్థలాల రేట్లు కూడా భారీగా పెరిగాయని, అయితే ప్రభుత్వ భూములు ఆక్రమించి, రెవిన్యూ రికార్డులు టాంపరింగ్ చేసి కొందరు అక్రమార్కులు ఈ భూములను విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు. రెవిన్యూ డివిజన్ కేంద్రంతోపాటు మున్సిపాలిటీగా పలాస కొనసాగడంతో భూ ఆక్రమణదారులు పేట్రేగిపోతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్ల లోపే పలాసలో పెరుగుతున్న భూకబ్జాలు, అక్రమ గ్రావిల్ దందా, చెరువు గర్భాల ఆక్రమణ తదితర విషయాలు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో భూకబ్జాలపై తీసుకునే చర్యలు ఏమిటో వివరించాలన్నారు. వాస్తవానికి పలాసలో ప్రభుత్వ భూములు, చెరువులు పరిరక్షించేందుకు పలాస ఎమ్మెల్యే కు స్థితప్రజ్ఞత ఉంటే తగు కార్యాచరణ చేపట్టాలని, చెరువుల పరిరక్షణకు చెరువు హద్దులను గుర్తించి, అందులో ఆక్రమణలకు గురైన భూభాగాన్ని కూడా గుర్తించి, ఇనుప కంచె వేసేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు.
పర్యావరణం, భూగర్భ జలాల పరిరక్షణతో పాటు ప్రజల దాహార్తి తీర్చేలా దూర దృష్టితో ఏర్పాటు చేసిన మంచినీటి చెరువులు ఆక్రమణలతో కుదించుకుపోకుండా , అది కనుమరుగు కాకుండా పరిరక్షించాలన్నారు. అదేవిధంగా కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూములు కబ్జాలు చేస్తూ, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి సొమ్ములు చేసుకునే అక్రమార్కులకు కళ్లెం వేయాలని, అందుకు మ్యాప్ స్కెచ్ లు వేసి, తగు పూర్తి సమాచారం తెప్పించుకొని, ఇనుప కంచె, బోర్డులు కూడా ఎమ్మెల్యే గౌతు శిరీష ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన కోరారు.
ప్రజా సమస్యలపై ఈ గడ్డపై పుట్టిన నేను ప్రశ్నిస్తుంటే, అధికార పార్టీ చెందిన నేతల అనుచరుల నుంచి సోషల్ మీడియాలో నాతోపాటు నా కుటుంబ సభ్యులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సబబు కాదని, సామాజిక మార్పు కోసమే ఒక లక్ష్యంగా చేసుకొని, ప్రజా సమస్యలపై నిలదీస్తుంటానని, అందుకు తాను సంధించిన ప్రశ్నలకు ఎమ్మెల్యే గౌతు శిరీష జవాబుదారీగా సమాధానం చెప్పాలని దువ్వాడ శ్రీధర్( బాబా) డిమాండ్ చేశారు.

# మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

- పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు చొరవ చూపాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



**నవతరం -శ్రీకాకుళం**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మార్చి 14న జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో లోక్ అదాలత్ నిర్వహణపై పోలీసు అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా ఉభయ పక్షాల మధ్య సయోధ్య కుదిర్చి, దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులను తగ్గించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. 'రాజీయే రాజమార్గం' అని, దీనివల్ల ఇరు వర్గాలూ విజయం సాధించినట్లవుతుందని, భవిష్యత్తులో వారి మధ్య సత్సంబంధాలు నెలకొంటాయని పేర్కొన్నారు.
మోటారు వాహన ప్రమాద కేసుల్లో ఇన్సూరెన్స్ కంపెనీలు సానుకూలంగా స్పందించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చాలని జడ్జి కోరారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు పోలీసు యంత్రాంగం కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒకటవ అదనపు జిల్లా జడ్జి పి. భాస్కరరావు, మూడవ అదనపు జిల్లా జడ్జి సిహెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎల్. ఫణి కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె. హరిబాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీధర్, అదనపు ఎస్పీ కె.వి. రమణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# సహాయకుల అవిశ్రాంత కృషిని అందరం గుర్తించాలి

మొదటిపేజీ తరువాయి

ఉద్యోగులను, వైద్య సహాయకులను ఉద్దేసింశించి సోమవారం సహావైద్యులతో కలసి మాట్లాడుతూ వైద్య బృందానికి సహాయమందిస్తున్న సహాయకుల అవిశ్రాంత కృషిని అందరం గుర్తించాలని, అన్ని రంగంలో అసాధారణమైన సేవలను అందించి కష్టపడి పనిచేసే నిపుణులను గౌరవించడానికి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 23న జాతీయ ఆతిథ్య కార్మికుల ప్రశంస దినోత్సవాన్ని (నేషనల్ హాస్పిటాలిటీ అప్రీసియేషన్ డే) జరుపుకుంటారని, అతిథులకు చిరస్మరణీయ అనుభవాలను సృష్టించడంలో వారి అంకితభావం, సృజనాత్మకత, స్థితిస్థాపకతను గుర్తించే రోజు ఉండటం గొప్పవిషయమన్నారు. వైద్యాలయాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, కళాశాలలు, పాఠశాలలు, పర్యాటక రంగం, ఉపన్యాస, కళారంగ తదితర విభాగాలలో కష్టపడి పనిచేసే దిగువస్థాయి ఉద్యోగులను, కార్మికులను, సహాయక సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరముందన్నారు. మా చిరునవ్వులతోపాటుగా, రోగుల కళ్ళల్లో ఆనందం వెనుక ఉన్న మీ కష్టానికి వందనాలని, ఆతిథ్య రంగంలో సేవలు అందజేయడం ద్వారా, మీ సేవలను గుర్తించడం మా అందరి బాధ్యతన్నారు. అనంతరం వైద్యాశాలలో సహాయకులకు, కార్మిక బృందానికి, ఉద్యోగులకు మిఠాయిలను పంచిపెట్టి, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఉపాధ్యక్షులు ఉర్లం.శివతేజ, సింధూర హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 25న శ్రీకాకుళంలో జాబ్ మేళా

## డీ-మార్ట్, ఫ్యూషన్ ఫైనాన్స్ సంస్థల్లో ఉద్యోగాలకు అవకాశం

**నవతరం -శ్రీకాకుళం**

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పథక సంచాలకులు పి. కిరణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సంస్థలైన డీ-మార్ట్, ఫ్యూషన్ ఫైనాన్స్‌లో అసోసియేట్, క్యాషియర్, పర్చేజ్ ఆఫీసర్, రిలేషన్‌షిప్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఈ ఎంపికలు జరుగుతాయి. 10వ తరగతి ఆపై అర్హత కలిగి, 19 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ. 16,000 నుండి రూ. 26,000 వరకు వేతనం లభిస్తుంది. డీ-మార్ట్ ఉద్యోగులకు హైదరాబాద్‌లో, ఫ్యూషన్ ఫైనాన్స్ ఉద్యోగులకు శ్రీకాకుళంలో పని ప్రదేశాలు ఉంటాయి. ఆసక్తి గల అభ్యర్థులు తమ వెంట రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు అప్‌డేటెడ్ బయోడేటాతో బుధవారం ఉదయం 9:30 గంటలకు శ్రీకాకుళంలోని నెహ్రూ యువ కేంద్రం వద్దకు హాజరుకావాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు 7989744612, 8106945415 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని పి.డి. తెలిపారు.

# పర్లి వైద్యనాధేశ్వరుని ఆలయం : మహారాష్ట్ర

ఈ స్వామి వారు అనారోగ్యాలను దూరం చేసే వైద్యుడని, వైద్యనాథేశ్వరుడని భక్తుల నమ్మకం. ఈ దేవాలయం చుట్టూ జ్యోతిర్లింగాల పేరు మీద శివలింగాలు ప్రతిష్టించి ఉంటాయి. పూర్తిగా ఆధునికత సంతరించుకున్న దేవాలయం. ఈ దేవాలయము మీద భిన్నాభిప్రాయాలున్నాయి. వైద్యనాథ్ అసలు దేవాలయము జ్యోతిర్లింగం ఉన్న ఇదీ అని పెద్దలు కూడా నిర్ణయించలేకపోయారు.

మహారాష్ట్రలోని జిల్లా ఉన్న పురాతనమైన శైవ పుణ్యక్షేత్రం ఇది. ఈ దేవాలయంలోని స్వామి వైద్యనాథ్ అని ప్రసిద్ధి చెందుటచే ఈ క్షేత్రాన్ని పర్లి వైద్యనాథ్ అనే ఎక్కువగా వ్యహరిస్తారు.మన భారతదేశంలోని పన్నెండు జ్యోతిర్లింగాల్లో ఒకటి. ఇది అతి పురాతనమైన మందిరం ఎన్నో శతాబ్దాలు కొనియాడలే నంత వైభవంగా విలసిల్లిన గొప్ప క్షేత్రం. 30 అడుగుల వెడల్పు, 50 మెట్లు ఉండి, అంత ఎత్తులో నిర్మించబడింది ఈ మహాదేవుని ఆలయం. గర్భగుడికి ఎదురుగా 15 అడుగుల ఎత్తులో టేకు దూలాలతో నిర్మించిన మండపం ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఇది ఆలయంలోని మంటపంలో మిగిలిన 11 జ్యోతిర్లింగాలనీ ప్రతిష్ఠించడం జరిగింది. అందువలన ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం ఇక్కడే జరుగుతున్నట్టు భక్తులు భావిస్తారు.

ఇక గర్భగుడిలో శివలింగం నేలనిఅంటి పెట్టుకున్న పానపట్టం మీద ఒక అడుగు ఎత్తులో తూర్పు ముఖంగా మందిరంలో ఒక ప్రక్కన పార్వతీదేవినీ, మరో పక్కన విఘ్నేశ్వరుణ్ని ప్రతిష్టించడం జరిగింది. ఇక్కడ శివలింగానికి ఎవరికి వారే స్వయంగా అభిషేకం చేసుకొనవచ్చు.సాయంత్ర వేళలో మాత్రం స్వామిని కవచంతో అలంకరించి హారతి సమర్పిస్తారు. చైత్ర, ఆశ్వయుజ మాసాల్లో సూర్యకిరణాలు ప్రప్రథమంగా వైద్యనాథ లింగేశ్వరునిపై ప్రసరించడం ఇక్కడ విశిష్టత.

ఈ క్షేత్రం ఒకప్పుడు క్షీణదశకి చేరుకున్నప్పుడు 17వ శతాబ్దంలో ఇండోర్ మహా రాణి అహల్యాబాయి ఈ దేవాలయాన్ని పునర్నిర్మించడం జరిగింది. అప్పటి నుండి పూర్వ వైభవాన్ని సంతరించుకుంది.

ఈ దేవాలయం కొద్దిగా ఎత్తులో ఉంటుంది. విశాలమైన మెట్లు ఎక్కి దేవాలయ ప్రవేశంచేస్తాం. ఈ దేవాలయాన్ని రాణి అహల్యాబాయి అభివృద్ధి చేశారని శాసనాల ద్వారా తెలుస్తుంది. అంతేకాకుండా ఆవిడ విగ్రహం ఇక్కడ ప్రతిష్టించి ఉంది. ఈ మహారాణి కాశి, అన్న ఉజ్జయిని, సోమనాథ, ఓంకారేశ్వర్, శ్రీశైలం, వైద్యనాథ్ మొదలగు దేవాలయాలను అభివృద్ధి చేసిన భక్తురాలు.


ఈ ఆలయం తూర్పు ప్రాకారం నుంచి బయటికి వస్తే పక్కనే లక్ష్మీనరసింహ, ఆంజనేయస్వామి విగ్రహాలు నిండుగా ఉంటాయి.శ్రీకృష్ణుని ఆలయం కూడా ఉండడం చేత దీనిని హరహర క్షేత్రంగా కూడా వ్యవహరిస్తారు.

ఈ క్షేత్రంలో మరో విశేషం ఏమిటంటే, ఇక్కడ వైద్యనాథస్వామిని తులసీ దళాలతో, విష్ణు మూర్తిని మారేడు దళాలతో పూజిస్తారు. మార్కండేయుని శివుడు చిరంజీవిగా చేసిన స్థలం ఇదే. భక్త సిరియాళ పరమ శివుని అనుగ్రహానికి పాత్రుడైన ప్రాంతం కూడా ఇదే అని ప్రతీతి. అయితే ఈ క్షేత్రానికి కొంత వివాదం లేకపోలేదు. బీహార్ లోని దేవఘర్ వైద్యనాథ క్షేత్రంగా కొందరు భావిస్తారు. అలాగే నాన్దేడ్ వద్దగల గంగాఖేడ్, పంజాబ్లో కీరా అనే ప్రాంతంలో ఒకటి, ఇలా వైద్యనాథ దేవాలయాలు ఉండటం మూలంగా ఈ విషయంలో కొంత వివాదం ఏర్పడింది. అయినా ఆదిశకరాచార్యులవారి స్తోత్రాలల్లో వివరిం చిన విధంగా దేవఘర్లో ఉన్నదే అసలైన వైద్యనాథ్ క్షేత్రమని పరిశీలకులు నిర్ధారించడం జరిగింది. ఏది ఏమైనప్పటికీ, పర్లి వైద్యనాథుడు, కూడా జ్యోతిర్లింగాల్లో ఒకటిగా ప్రకాశిస్తూనే ఉన్నాడు.

మనం గమనించవలసిన ఒక భౌగోళిక అద్భుతం కూడా ఒకటి ఉంది. ఇది కన్యాకుమారి నుండి ఉజ్జయిని వరకూ ఒక సరళ రేఖగా చూస్తే,దాని మధ్యస్థానానికి వస్తుంది ఈ పర్లి క్షేత్రం. అంతేకాక మేరుపర్వతానికి, నారాయణ పర్వతానికి కూడా మధ్యస్థంగానే, గంగా,



యమునా, సరస్వతి నదీ సంగమ ప్రాంతంలో వెలసిన పురాతన పటణం ఈ పర్లి, చుట్టూ అనేక ఔషధులతో కూడిన అనేక పర్వతశ్రేణుల మధ్య ఉన్న అటవీ ప్రాంతం కావడం చేతకూడా వైద్యనాథ్ అనే పేరువచ్చిందని కొందరు అంటారు.
ఏదైనా శివుని చిద్విలాసాలు తెలుసుకోడం మానవుల తరం కాదు. కాశీ అయినా, ప్రయాగ అయినా మరొకటైనా భూమండలానికి కావలసిన శక్తిని ప్రసాదించే ప్రాంతాల్ని మనం పుణ్యక్షేత్రాలుగా పరిగణిస్తూ, ఆయా ప్రాంతాల సందర్శనంతో మన మనుగడకి కావలసిన శక్తియుక్తుల్ని, ఆరోగ్య భాగ్యాల్ని వెంటతెచ్చుకుంటున్నాం. వివాదాలకన్నా అటు వంటి చోట ఉన్న ప్రాముఖ్యతకి మనం విలువ నివ్వడం ఎంతైనా అవసరం.
మన హిందూ సాంప్రదాయంలో శివుడు స్థాణువు, నారాయణుడు సర్వవ్యాప్తి, అందు వలన స్మరించడం ద్వారా విష్ణువు, దర్శించడం ద్వారా శివుడు మోక్షాన్ని కలగజేస్తారని ప్రగాఢ విశ్వాసం.

వ్యాసకర్త
ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్, ఆధ్యాత్మక సాహిత్య సామ్రాట్ కావ్యసుధ, హైదరాబాద్,

సెల్ 92473 13488

## పరిపూర్ణమైన నాయకుడు స్వర్గీయ
# శ్రీ కింజరాపు ఎర్రన్నాయుడు
### - నివాళులు అర్పించిన చౌదరి. పురుషోత్తం నాయుడు



**నవతరం -శ్రీకాకుళం**

పరిపూర్ణమైన నాయకుడు మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ శ్రీ కింజరాపు ఎర్రన్నాయుడు అని, తెలుగు రాష్ట్రాలలో అత్యంత ప్రజాదరణ పొందిన నాయకులలో దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు ఒకరని, ఏపీ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ చైర్మన్ అమరావతి చౌదరి.పురుషోత్తం నాయుడు అన్నారు. కింజరాపు.ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా స్థానిక ఎనభై అడుగుల కూడలి కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాలలుతో అంజలి ఘటించి, నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతూ మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందిన కింజరాపు దాలి నాయుడు, కళావతమ్మ దంపతుల నలుగురు కుమారుల్లో పెద్ద కుమారుడిగా ఎర్రన్నాయుడు జన్మించారని, బ్రతికినంతకాలం ప్రజల కోసం ఆలోచించేవారని, ప్రజానాయకునిగా అందరి మనస్సులో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయనలోని నాయకత్వ లక్షణాలు ఆయన విద్యార్థి రోజుల్లోనే స్పష్టంగా కనిపించాయని, జాతీయ రాజకీయాల్లో కీలక టీడీపీ నాయకుడిగా ఎదిగారని, ముక్కుసూటితనం ఉన్నా, ఎప్పుడూ చిరునవ్వుతోనే పలకరించేవారని, సహాయం అనగానే మరోమాట లేకుండా అండగా నిలిచేవారని, ఆయన తనయుడు కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామమోహన్ నాయుడు అదేబాటలో నడుస్తూ, దేశంలోనే అగ్రనేతగా కొనసాగుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తూ, కేంద్రంలో రాజకీయచక్రం తిప్పుతున్నారన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్వి ఎన్ శర్మ, ఎస్ వి డి మురళి, బలివాడ గోవిందరావు, డబ్బీరు.వెంకట్రావు, నాగేశ్వరరావు, బలివాడ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నార

# అగ్రిగోల్డ్ సమస్యపై 'తాడో పేడో' తేల్చుకుంటాం

- ప్రభుత్వం మనసు పెడితే బాధితులకు న్యాయం చేయడం పెద్దపని కాదు
- అగ్రిగోల్డ్ యాజమాన్యం తమ ఆస్తుల పై హక్కులను ప్రభుత్వం కి ఇవ్వాలి
- మార్చి 2 నుంచి రిలే నిరాహారదీక్షలు
- మార్చి 5 నుంచి నిరవదిక నిరహార దీక్ష
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వర రావు



**నవతరం -శ్రీకాకుళం**

అగ్రిగోల్డ్ బాధితుల దశాబ్దాల నిరక్షణ, పోరాటాల తో ఇప్పటికీ న్యాయం జరగకపోవడం దారుణం అని, ఇక ఓపిక నశించిందని, నిరహార దీక్ష లు చేసి తాడో పేడో తేల్చుకుంటాం అని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వర రావు అన్నారు. అగ్రిగోల్డ్ అసోసియేషన్ నిర్వహించనున్న నిరాహారదీక్ష ల ఉద్యమ కార్యాచరణ లో భాగంగా సోమవారం శ్రీకాకుళం జిల్లా లో అగ్రిగోల్డ్ బాధితులతో సమావేశం నిర్వహించారు. ముందుగా రణస్థలం మండలం లోని అగ్రిగోల్డ్ కి సంబంధించి రియల్ ఎస్టేట్ వెంచర్ ను పరిశీలించారు. అనంతరం శ్రీకాకుళం పట్టణం లోని ఎన్ ఆర్ దాసరి క్రాంతి భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై ప్రభుత్వం చిత్తశు ద్ధి తో పరిష్కారం చూపాలన్నారు. ప్రభుత్వం మనసు పెడితే బాధితులకు న్యాయం చేయడం పెద్ద కష్టమైన పని కాదని అభిప్రాయపడ్డారు. వేల కోట్ల ఆస్తులు అటాచ్మెంట్లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన విక్రయించి లేదా ప్రభుత్వమే పూచీకత్తుగా ఉండి నిధులు విడుదల చేయాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు హై లెవెల్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, కమిటీ చైర్మన్ గా ఉన్న సి ఎస్ ఇప్పటివరకు బాధితులతో సమావేశం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే న్యాయం చేసేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ ప్రభుత్వం న్యాయం చేస్తాదని ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న కాలయాపన జరుగుతుందే తప్ప న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం ఒకపక్క మొసలి కన్నీరు కారుస్తూ మరోపక్క న్యాయస్థానాల్లో కేసులు వేసి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగకుండా మోకాళ్ళు అడ్డుతుందన్నారు. అగ్రిగోల్డ్ యాజమాన్యానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే యాజమాన్య ఆధీనంలో ఉన్న ఆస్తుల పూర్తి అధికారాలు ప్రభుత్వానికి అప్పజెప్పాలన్నారు. వివిధ రూపాల్లో ఆందోళన చేసిన బాధితులకు మాత్రం న్యాయం జరగడం లేదని, ఇక ఓపిక నశించిందని తాడోపేడో తేల్చుకునేందుకు అసోసియేషన్ నిర్ణయం తీసుకుందన్నారు. అందులో భాగంగా రెండు మార్చి 2 వ తేదీన విజయవాడ లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. రిలే దీక్షలకు ప్రభుత్వం స్పందించని పక్షంలో, మార్చి 5వ తేదీ నుండి నిరవధిక నిరాహార దీక్షలకు దిగుతామని, ఈసారి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దశాబ్దాలు గడుస్తున్న న్యాయం మాత్రం జరగకపోవడం బాధాకరమని ప్రభుత్వం పెద్ద మనసుతో అర్థం చేసుకుని ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని కోరారు. గతంలో మనం చేసిన పోరాటాలతో కొందరికి న్యాయం జరిగిందని ఈసారి చేస్తున్న నిరాహార దీక్షలతో పూర్తిస్థాయి న్యాయం జరగాలంటే పెద్ద ఎత్తున బాధితులు ఈ దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి బాధితులు విజయవాడ చేరుకొని తన ఆవేదన ప్రభుత్వానికి చేరేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తిరుపతిరావు మాట్లాడుతూ మేడారం జాతరలో కోవా బన్ వ్యాపారితో కొందరు ప్రవర్తించిన తీరుపై స్పందించిన లోకేష్ ఆ వ్యాపారితో కలుస్తానన్నారని, మరి 30 లక్షల మందికి పైగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడానికి ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే నిరాహార దీక్షలు చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందని, ఈ పట్టే నిరాహార దీక్షలతోనే మనకు న్యాయం జరిగేలా చేద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈవీ. నాయుడు, ఉపాధ్యక్షులు జయసింహ, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి. ఆరేలమ్మ, జిల్లా కార్యదర్శి పి . గోవింద్, జిల్లా గౌరవ అధ్యక్షులు సనపల నరసింహులు, అక్షయ గోల్డ్ బాధిత సంఘం నాయకులు నూకరాజు , పెద్ద ఎత్తున బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# సత్యాన్వేషణ లో బ్రూనో బలిదానం పుస్తక ఆవిష్కరణ



**నవతరం -శ్రీకాకుళం**

జన విజ్ఞాన వేదిక ప్రచురించిన "సత్యాన్వేషణలో బ్రూనో బలిదానం" పుస్తకాన్ని శ్రీకాకుళం లోని యుటిఎఫ్ భవన్ లో ఆవిష్కరించడం జరిగింది. జన విజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో "సత్యాన్వేషణలో బ్రూనో బలిదానం" పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి లు ఆవిష్కరించడం జరిగింది.

కార్యక్రమంలో గొంటి గిరిధర్ మాట్లాడుతూ సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించి మతోన్మాదులకు వ్యతిరేకమై సత్యాన్వేషణ కోసం, శాస్త్రీయ విజ్ఞానం కోసం సజీవ దహనానికి కూడా వెనకడకుండా బలిదానం చేసుకున్న బ్రూనో గొప్ప దార్శినికుడని కొనియాడారు. 425 సంవత్సరాల క్రితం సత్యం కోసం ప్రాణాలర్పించిన ఫిబ్రవరి 17 సత్యాన్వేషణ దినం ను స్ఫూర్తిగా మూఢ విశ్వాసాలను సమాజం నుండి దూరం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మూఢ విశ్వాసాల నిరోధక చట్టాన్ని చేయాలని కోరారు.

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు స్వీయ పరిశోధనలకు ప్రోత్సహించేందుకు "యురేకా సైన్స్ ఎక్స్పో" ఆన్లైన్ ప్రయోగ పోటీలను జెవివి నిర్వహిస్తున్నదని దానిలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని గిరిధర్ కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ మూఢ విశ్వాసాలను దూరం చేసే శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం బ్రూనో స్ఫూర్తిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంచే కార్యక్రమాలను నిర్వహిస్తూ జనవిజ్ఞాన వేదిక సమాజాభివృద్ధికి విశేషమైన కృషి చేస్తున్నదని అభినందించారు.కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి ధనలక్ష్మి, బి తవిటమ్మ, అప్పారావు, కే శాంతి ప్రియులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళంలో బీజేపీ జనతా వారధి

## - జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల స్వీకరణ
## - దేవాలయాల ఘటనలపై విచారణకు కలెక్టర్‌కు వినతి




**నవతరం శ్రీకాకుళం**

శ్రీకాకుళం, ఫిబ్రవరి 23: ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం లభించేలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు, శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో 7వ విడతగా "జనతా వారధి" కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల నుంచి వివిధ సమస్యలను స్వీకరించారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులకు తెలియజేసి, వాటి పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జనతా వారధి జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2019-2024 మధ్య కాలంలో హిందూ దేవాలయాలపై జరిగిన విధ్వంసాలు, దాడుల ఘటనలపై సమగ్ర విచారణ జరిపి, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వివిధ ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను జిల్లా పరిషత్ కార్యాలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బైరి అప్పారావు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి అన్నెపు ఉమామహేశ్వరరావు, జనతా వారధి కో-కన్వీనర్లు నారాయణశెట్టి శ్రీనివాస్, ఎర్రగుంట్ల జగన్మోహన్, శ్రీకాకుళం రూరల్ మండల అధ్యక్షుడు గొల్లంగి అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత బస్సు ప్రయాణము

# ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్ష్యం

### డిపో మేనేజర్ కు బిజెపి నాయకులు వినతి



**నవతరం-టెక్కలి**

నియోజకవర్గం బిజెపి నాయకులు టెక్కలి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇటీవలకూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ పథకంరాష్ట్రంలో అమలు చేయడం జరుగుతుంది, ఈ పథకం కింద ప్రతి మహిళ ఉచితంగా ఆర్డినరీ మరియు ఎక్స్ ప్రెస్ బస్సులలో ప్రయాణించే విధంగా సౌకర్యం కల్పించడం జరిగింది కానీ కొంతమంది ఆర్టీసీ బస్ డ్రైవర్లు నిర్లక్ష్యంతో మహిళలు ఉన్నచోట ఆపకపోవడంతో మహిళలు ప్రభుత్వం మీద వ్యతిరేకత చూపిస్తున్నారు, అలాగే మత్స్యకార మహిళలు చేపల గంపలు ఉన్నాయని వారున్నచోట బస్సులు ఆపకపోవడం తో పాటుగా వెనకవైపు మరో బస్సు వస్తుందని అందులో ఎక్కవలసిందిగా చెప్పుకుంటూ వెళ్లిపోతున్నారనీ, ఆవేదన వ్యక్తం చేస్తూ ఉన్నారు. అదేవిధంగా బస్సులో కొంతమంది టిక్కెట్ తీసుకున్న వ్యక్తులు ఉన్నచో బస్సు లో ఉన్న కండక్టర్ వారికి చిల్లర లేదని యమయాతన చూపిస్తున్నారని తమ యొక్క ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. ప్రతిరోజు తమ విధులకు వచ్చిన కండక్టర్లకు కొంత చిల్లర ను డిపాజిట్ చేసి పంపించే బాధ్యత ఉన్నత అధికారులకు లేదా అని ప్రయాణికులు వాపోతూ ఉన్నారు. వేసవికాలం కారణంగా మండుట ఎండల్లో ఎక్కువగా ఉండవలసి వస్తుందని తీవ్ర ఆందోళన చెందుతున్నారు . శ్రీకాకుళం, టెక్కలి మరియు పలాస డిపో నుండి జిల్లాలో నలువైపులా బస్సులు తిరుగుతున్న బస్సులు ఆపని కారణంగా నిత్యం మహిళల నరకయాతన అనుభవిస్తున్నారు, దీని కారణంగా కూటమి ప్రభుత్వంకి చెడ్డ పేరు వచ్చే విధంగా డ్రైవర్లు మరియు కండక్టర్లు ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని, డిఎం బస్సు డ్రైవర్ల మరియు కండక్టర్లతో సమీక్షించి ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా చూడాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ జన్ని పరమేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు నడిపూరి లక్ష్మీనారాయణ, నందిగాం మండల అధ్యక్షులు ఏదురు కామరాజు ,టెక్కలి మండల ఉపాధ్యక్షులు ఆకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరుకున్న సోంపేటలోని సబ్ ట్రెజరీ కార్యాలయం



**నవతరం-సోంపేట**

శ్రీకాకుళం జిల్లా సోంపేటలోని సబ్ ట్రెజరీ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది తో పాటు కార్యాలయానికి నిత్యం వచ్చే వందలాది ప్రజల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్, ఉత్తరాంధ్ర ఇంచార్జ్ డాక్టర్ సీపాన గుణవతి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయం పై తక్షనచర్యలు తీసుకోవాలని కోరుతూ సోంపేట తహసీల్దార్ అప్పలస్వామి గారికి వినతి పత్రం ఇచ్చిన అనంతరం సోమవారం నాడు మీడియా కు తెలిపారు

బ్రిటిష్ పాలన కాలం నాటి, భద్రతా ప్రమాణాలకు పూర్తిగా విరుద్ధమైన పెంకుల భవనంలో ఇప్పటికీ సోంపేట సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని కొనసాగించడం అధికారుల ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆమె తీవ్రంగా విమర్శించారు.

ఒకవైపు ప్రభుత్వ కార్యాలయాల ఆధునీకరణపై ప్రకటనలు చేస్తూనే, మరోవైపు కీలకమైన ట్రెజరీ కార్యాలయాన్ని ప్రాణాపాయ స్థితిలో నడపడం మానవ హక్కుల ఉల్లంఘనకు సమానమని స్పష్టం చేశారు.

ఈ భవనంలో తహసీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ట్రెజరీ సంబంధిత పనుల కోసం ప్రతిరోజూ వందలాది మంది రైతులు, ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. కొంతమంది ప్రజలు భవనం కిందనే కూర్చుని విశ్రాంతి తీసుకునే పరిస్థితి ఉండటం చూస్తే, అధికారులు ఎంతటి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోందని డాక్టర్ గుణవతి వ్యాఖ్యానించారు.

వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారడం, గోడల నుంచి మట్టికణాలు ఊడిపోవడం, విద్యుత్ వైర్లు తడిసి వేలాడుతూ ఉండటం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయని తెలిపారు. ఏ క్షణమైనా పైకప్పు కూలిపోవడం, విద్యుత్ షాక్ సంభవించడం ద్వారా భారీ ప్రాణ నష్టం జరిగే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, అధికారులు స్పందించకపోవడం అమానుషమని బీసీ నాయకులు మండిపడ్డారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలపరిమితి ముగిసిన, భద్రత లేని భవనాలను ఉపయోగించరాదని స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఒక అత్యంత కీలకమైన ఆర్థిక శాఖ కార్యాలయాన్ని ఇలాంటి ప్రమాదకర భవనంలో కొనసాగించడం ద్వారా అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండించింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం కలిగిన జీవించే హక్కు, సురక్షిత పని వాతావరణ హక్కు ఈ పరిస్థితుల్లో పూర్తిగా కాలరాయబడుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే, అది ప్రకృతి వైపరీత్యం కాదని, పూర్తిగా అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా పేర్కొన్నారు.

అలాంటి సందర్భంలో ప్రభుత్వం భారీ నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందని, అధికారులు, ప్రభుత్వ తప్పి దాలకు ప్రజాధనం వృథా అవుతుందని హెచ్చరించారు.

ఈ సబ్ ట్రెజరీ కార్యాలయం సోంపేట తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకొని ఉండగా, జిల్లా కలెక్టర్ సహా అనేక మంది జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ గొడ్లు చావడికంటే దారుణంగా ఉన్న ఈ భవనం దుస్థితి కనిపించకపోవడం లేదా పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి, యుద్ధప్రాతిపదికన సోంపేట సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సురక్షితమైన ప్రత్యామ్నాయ భవనానికి తరలించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో గౌరవ జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్‌తో పాటు సంబంధిత న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని నాయకులు స్పష్టం చేశారు.

అన్నిటికంటే విలువైనది మానవ ప్రాణాలేనని, ప్రమాదం జరిగాక పరపతి చూపడం కాదు- ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవడమే బాధ్యతాయుతమైన పాలన అని డాక్టర్ సీపాన గుణవతి స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ న్యాయం చేయాలని ఇచ్ఛాపురం గౌరవ శాసనసభ్యులు బెందారం అశోక్ గారిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కొరింది. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు రవికుమార్, మురళి, ప్రధాన కార్యదర్శి మల్ల యుగంధర్, జిల్లా గోరవ సలహాదారు లోపునింది గోవిందరాజులు, పలాస సబ్ డివిజన్ కార్యదర్శి లొట్ల కృష్ణమూర్తి, సోషల్ మీడియా కన్వీనర్ పిట్ట పాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనముగా స్వర్గీయ ఎర్రన్నాయుడు 69వ జయంతి కార్యక్రమం

**నవతరం టెక్కలి**

నేడు స్థానిక టెక్కలి పట్టణ పరిధిలో వివిధ చోట్లలో గల దివంగత నేత కి'శే స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు 69 వ జయంతి కార్యక్రమాన్ని పట్టణ పరిధిలో గల నాయకులు కార్యకర్తలు ఘనముగా జరుపుకొన్నారు. సందర్భంగా టెక్కలి పట్టణం లో చిన్న బజార్ పార్కులో గల ఎర్రన్నాయుడు గారి విగ్రహానికి, ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరఉన్న ఎర్రన్నాయుడు విగ్రహానికి, నేషనల్ హైవే దరి ఎర్రన్నాయుడు పార్కులో గల ఎర్రన్నాయుడు విగ్రహానికి మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరి రావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగతఎ రన్నాయుడు వారి సేవలు ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమం లో టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కోళ్ల లవ కుమార్, కోళ్ల కామేష్ ,మామిడి రాము, హనుమంతు రామకృష్ణ ,మట్ట పురుషోత్తం ,ధవళ రామచంద్రుడు మెట్ట చంద్రారావు కోరాడ రాంప్రసాద్ కార్యకర్తలు,



అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్ట్ అధ్యక్షులు ఆదిలక్ష్మి

# అంగన్వాడి ఉద్యోగస్తులకు ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలి

**నవతరం టెక్కలి**

నేడు స్థానిక టెక్కలి మండలం అంగన్వాడి ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరాహార దీక్షను చేపట్టారు.అంగన్వాడీ లకు కనీస వేతనం 26,000/ రూపాయలు చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నీ అంగన్వాడీ కుటుంబాలకు అందజేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, లేబరు కోడ్ లు రద్దు చేయాలని తదితర డిమాండ్లతో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపు మేరకు ఈ దినం టెక్కలి అంగన్వాడీ ప్రాజెక్టు ఆఫీసు ముందు నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలుకు మద్దతుగా సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య ప్రసంగించారు. ప్రభుత్వ నిర్ణయాలన్ని కార్మికులు కు, కష్టజీవులు కు వ్యతిరేకంగా, దోపిడీ వర్గాలు కు అనుకూలంగా ఉన్నాయని, అందుకు అడ్డంకిగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబరు కోడ్ లు తెచ్చారని అన్నారు. పోరాటాలు ద్వారానే హక్కులు సాధించుకుందామని, నిర్బంధాలు ను అధిగమించి



ముందుకు సాగండి అంటూ పిలుపునిచ్చారు. రేపు కూడా నిరాహార దీక్షలు జరుగుతాయి అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ టెక్కలి ప్రాజెక్టు అద్యక్ష, కార్యదర్శులు ఆదిలక్ష్మి,బి.రవణమ్మ,నిర్మల,అరుణ, దమయంతి,పద్మ, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**